బుధవారం 16-10-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 484 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

## మరో రెండు రాష్ట్రాల్లో ఎన్నికల నగారా

- మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్
- రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 23న
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ వివరాలు వెల్లడి



**ముందడుగు జాతీయం:**

దేశంలో మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను మీడియాకు వెల్లడించారు. మహారాష్ట్రలో ఒకే దశలో, ఝార్ఖండ్‌లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మిగతా 2లో




# దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకం

### పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో కలిసి నడవాలి

### దామగుండం ఫారెస్టులో రాడార్ స్టేషన్ శంకుస్థాపన

### సభలో మాట్లాడిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**ముందడుగు తెలంగాణ:**

రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో అందరూ కలిసి ముందుకెళ్లాలన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వు ఫారెస్టులో రాడార్ స్టేషన్ మిగతా 2లో




### ట్రాఫిక్ నియంత్రణకు త్వరలోనే ఎగిరే ట్యాక్సీలు

మిగతా 2లో



### రూ.7.16 కోట్లతో 358 మద్యం దుకాణాలకు దరఖాస్తు

మిగతా 3లో



### రైలు కిటికీ నుంచి జారిపడ్డ 8 ఏళ్ల చిన్నారి

మిగతా 3లో

## ప్రజలకు సేవ చేయాలని మీకు లేదా..?

### ఐఏఎస్ అధికారులకు లభించని ఊరట

### కేంద్రం ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సిందే



02


## ఆగస్టు నెలలో భారీ సంఖ్యలో వాట్సాప్ ఖాతాలపై నిషేధం

### ఒక్క నెలలో 84.58 లక్షల ఖాతాలపై చర్యలు

**ముందడుగు జాతీయం:**

ప్రముఖ సోషల్ మీడియా యాప్ వాట్సప్‌ను మన దేశంలో కోట్లాది మంది వినియోగిస్తున్నారు. ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు దీన్ని అడ్డాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా మోసాలు విపరీతంగా పెరిగాయి. మిగతా 2లో




### మెగ్నీషియం.. మెగా ప్రయోజనం!

మిగతా 4లో

ముందడుగు
బుధవారం, 16-10-2024, హైదరాబాద్

# ట్రాఫిక్ నియంత్రణకు త్వరలోనే ఎగిరే ట్యాక్సీలు

## కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సిద్ధం

### గంటా 50 నిమిషాల ప్రయాణం కేవలం 5 నిమిషాల్లో

ముందడుగు జాతీయం:

విపరీతంగా పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని తక్కువ ఎత్తులో పర్యావరణహిత ప్రయాణ సేవలు అందించేందుకు బెంగళూరు కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సిద్ధమైంది. త్వరలోనే నగరంలో ఎగిరే ట్యాక్సీలు తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. దీని కోసం సార్లా ఏవియేషన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని కంపెనీ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. విమానాశ్రయం, ఎలక్ట్రానిక్ సిటీ.. ఇలా ఎక్కువ ట్రాఫిక్ ఉన్న ప్రదేశాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా తక్కువ సమయంలో గమ్యాన్ని చేరేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని పేర్కొంది.



"ప్రస్తుతం ఇందిరానగర్ నుంచి విమానాశ్రయానికి చేరాలంటే గంటా 50 నిమిషాలు పడుతోంది. అదే ఎగిరే ట్యాక్సీలతో అయితే కేవలం 5 నిమిషాలు చాలు" అని సార్లా ఏవియేషన్ సీఈఓ అడ్రియన్ ష్మిత్ అన్నారు. ఇదో గేమ్ ఛేంజర్‌గా ఆయన అభివర్ణించారు. అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని ఆయన తెలిపారు. ఈ సేవలు అందుబాటులోకి వచ్చేందుకు 2 3 సంవత్సరాలు పడుతుందన్నారు.

# దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకం

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో రక్షణ మంత్రి ప్రసంగించారు. అబ్దుల్ కలాం జయంతి నాడు వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు ఏర్పాటుకు అన్ని విధాలా అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకమన్నారు. కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. "కమ్యూనికేషన్ విషయంలో భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలి. సాంకేతికయుగంలో కమ్యూనికేషన్ అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. కమ్యూనికేషన్ రంగంలో పావురాలు, గుర్రాల నుంచి ఇక్కడి వరకు వచ్చాం. తపాలా వ్యవస్థను అనేక ఏళ్లుగా వినియోగించుకున్నాం. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం.. సమాచారం క్షణాల్లో చేరుతోంది. సమాచార విప్లవం.. ఇవాళ అనేక దేశాలను దగ్గర చేస్తోంది. విద్య, వైద్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది. వీఎల్ఎఫ్‌కు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# మరో రెండు రాష్ట్రాల్లో ఎన్నికల నగారా

(మొదటిపేజీ తరువాయి)

మహారాష్ట్రలో నవంబర్ 20 (బుధవారం) న పోలింగ్ జరగనుండగా.. ఝార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 23న చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు**

అలాగే, దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. కేరళలోని వయనాడ్, మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు వేర్వేరు రాష్ట్రాల్లో 48 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు 47 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న, నాందేడ్ లోక్‌సభ సీటుతో పాటు ఉత్తరాఖండ్‌లోని ఒక అసెంబ్లీ స్థానానికి నవంబర్ 20న పోలింగ్ నిర్వహించి నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# ఆగస్టు నెలలో భారీ సంఖ్యలో వాట్సాప్ ఖాతాలపై నిషేధం

## ఒక్క నెలలో 84.58 లక్షల ఖాతాలపై చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో భారీ సంఖ్యలో ఖాతాలపై వాట్సప్ నిషేధం విధించింది. ఒక్క ఆగస్టులోనే సుమారు 80 లక్షల ఖాతాలను బ్యాన్ చేసింది. తమ ప్రైవసీ పాలసీని ఉల్లంఘించినందుకు గానూ ఈ చర్యలు చేపట్టినట్లు వాట్సప్ తెలిపింది. ఐటీ యాక్ట్, 2021 నిబంధనలను అనుసరించి ఆగస్టు నెలలో భారీ సంఖ్యలో ఖాతాలపై నిషేధం విధించినట్లు వాట్సప్ తెలిపింది.

మొత్తం 84.58 లక్షల ఖాతాలపై చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ఇందులో సుమారు 16.61 లక్షల ఖాతాలను ముందు జాగ్రత్త చర్యగా బ్యాన్ చేశామని తెలిపింది. మోసానికి ఆస్కారం ఉండే బల్క్ మెసేజ్‌లు లేదా అసాధారణ మెసేజ్‌లను వాట్సప్ తన ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా ముందుగానే గుర్తించి ఈ చర్యలు చేపట్టింది. అలాగే, ఆగస్టు నెలలో గ్రీవెన్స్ మెకానిజం ద్వారా యూజర్ల నుంచి 10,707 ఫిర్యాదులు అందినట్లు వాట్సప్ వెల్లడించింది.

**వాట్సాప్ ఖాతాలు ఎందుకు నిషేధం**

వాట్సప్ టర్మ్స్ అండ్ కండీషన్లను ఉల్లంఘించినందుకు గానూ వాట్సప్ ఈ తరహా చర్యలు తీసుకుంటుంది. మోసం లేదా తప్పుడు సమాచారం చేరవేతకు బల్క్, స్పామ్ మెసేజులు పంపించడం నిబంధనలకు విరుద్ధంస్థానిక చట్టాలకు వ్యతిరేకంగా అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా వాట్సప్ చర్యలు తీసుకుంటుంది. అనుచిత ప్రవర్తన, వేధింపులు వంటి విషయాల్లో యూజర్ల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు సంబంధిత ఖాతాలను వాట్సప్ బ్యాన్ చేస్తుంటుంది.

# ఆన్‌లైన్ బుకింగ్ లేకున్నా శబరిమల దర్శనం

ముందడుగు తిరువనంతపురం:

కేరళలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలకు వచ్చే భక్తుల దర్శనంపై విధించిన ఆంక్షల విషయంలో పినరయి విజయన్ సర్కారు యూటర్న్ తీసుకుంది. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోని భక్తులు సైతం శబరిమల అయ్యప్పను సాఫీగా దర్శనం చేసుకోవచ్చునని మంగళవారం ప్రకటించింది. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్న భక్తులకు మాత్రమే దర్శనం కల్పిస్తామంటూ ఇంతకుముందు విజయన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై భక్తుల నుంచి పెద్దయెత్తున నిరసన వ్యక్తం అయ్యింది. దీంతో సీఎం విజయన్ మంగళవారం దీనిపై అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న భక్తులతో పాటు, రిజిస్ట్రేషన్ లేకుండా నేరుగా వచ్చిన భక్తులకు కూడా దర్శనం కల్పిస్తామని తెలిపారు. వర్చువల్ బుకింగ్‌ను విపక్షాలు, భక్తులు విమర్శి ంచడంతో సర్కార్ దిగివచ్చింది.

# ప్రజలకు సేవ చేయాలని మీకు లేదా..?

ముందడుగు తెలంగాణ:

"ఏపీలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి చోటుకు వెళ్లి వారికి సేవ చేయాలని మీకు లేదా? ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకి పూర్తి అధికారాలు ఉన్నాయి. స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం గైడ్‌లైన్స్‌లో ఉందా?" అని క్యాట్ ప్రశ్నించింది. వన్ మ్యాన్ కమిటీ సిఫారసులను డీవోపీటీ పట్టించుకోవడం లేదని ఐఏఎస్ అధికారుల తరపు న్యాయవాది క్యాట్ దృష్టికి తెచ్చారు. సింగిల్‌మెన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్రం ఉత్తర్వులు జారీ చేసే ముందు కమిటీ నివేదికను ఇవ్వలేదన్నారు. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్‌రాస్‌లు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఏపీలో పనిచేస్తున్న సృజన తెలంగాణకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. కేటాయింపుల సమయంలో కేంద్రం తమ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వాదనల అనంతరం .. డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది.

ముందడుగు
బుధవారం, 16-10-2024, హైదరాబాద్



# తన బదిలీ జరిగిన రోజే ప్రభుత్వ అధికారి ఆత్మహత్య

## అవినీతి ఆరోపణలు రావడాన్ని అవమానంగా భావించారు

ముందడుగు కేరళ:

ఓ ప్రభుత్వ ఉన్నతాధికారు తన బదిలీ వీడుకోలు సభలో తనపై అవినీతి ఆరోపణలు రావడాన్ని అవమానంగా భావించిన ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేరళలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళకు చెందిన నవీన్‌బాబు కన్నూర్ జిల్లాలో అదనపు జిల్లా మెజిస్ట్రేట్‌గా పని చేశారు. ఇటీవల ఏడీఎంగా ఆయనకు వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో సహోద్యోగులంతా సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఆ సభకు జిల్లా కలెక్టర్ సైతం హాజరయ్యారు. జిల్లా పంచాయతీల అధ్యక్షురాలు పీపీ దివ్య సభలో మాట్లాడుతూ నవీన్‌బాబు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

పెట్రోల్ బంకు అనుమతికి సంబంధించిన ఫైల్‌ను ఎన్నో రోజులు పక్కనపెట్టి రెండ్రోజుల కిందటే ఆమోదించారని, అలా ఎందుకు చేశారో తెలుసని ఆమె అన్నారు. రెండ్రోజుల్లో మరిన్ని విషయాలు వెల్లడిస్తానన్నారు. ఈ సభకు హాజరైన కలెక్టర్ ముందే దివ్య తనపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని అవమానంగా భావించిన నవీన్‌బాబు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈనేపథ్యంలో మంగళవారం పల్లికున్నులోని తన క్వార్టర్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు పేర్కొన్నారు.

# రూ.7.16 కోట్లతో 358 మద్యం దుకాణాలకు దరఖాస్తు

## లాటరీలో గెలుచుకున్నవి 10 మద్యం దుకాణాలు

ముందడుగు ఆంధ్రప్రదేశ్:

ఏపీలో మద్యం షాపులను దక్కించుకునేందుకు స్థానికులే కాకుండా.. ఇతర రాష్ట్రాలు, అమెరికా, యూరోప్ నుంచి కూడా పలువురు పోటీ పడ్డారు. విదేశాల్లో ఉన్న వ్యక్తులు ఆన్ లైన్ లో దరఖాస్తులు పంపారు. విశాఖపట్నంలో ఓ వ్యక్తి ఏకంగా 155 లిక్కర్ షాపులకి దరఖాస్తు చేసుకున్నాడు. దీనికోసం ఏకంగా రూ.3.10 కోట్లు రుసుము చెల్లించాడు. ఇదే చాలా ఎక్కువ అనుకుంటే ఇప్పుడు అంతకు మించిన మరో వార్త బయటకి వచ్చింది.





మద్యం లాటరీ పూర్తి అయిన తర్వాత.. వ్యక్తి ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. తన స్నేహితులతో కలిసి మద్యం దుకాణాల లైసెన్సుల కోసం ఏకంగా రూ.7.16 కోట్లు దరఖాస్తు రుసుం చెల్లించామని పేర్కొన్నారు. ఎన్ని లైసెన్సులు వచ్చాయనేదీ పక్కనబెడితే.. మొత్తం 358 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసినట్లు తెలిపాడు. ఇక దీని కోసం దరఖాస్తు రుసుము కింద రూ.7.16. కోట్లు చెల్లించామని చెప్పాడు.

అయితే లాటరీలో 10 మద్యం దుకాణాలు మాత్రమే వచ్చాయన్నాడు. తనకు డబ్బులు పోయినందుకు బాధ లేదని.. రాష్ట్రాభివృద్ధి కోసం మనం ఏడు కోట్లు విరాళం ఇచ్చామని గర్వంగా ఫీలవ్వమని చెప్పానంటూ ట్వీట్ చేశాడు. ఇక 358 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేస్తే విజయవాడ సిటీలో నాలుగు, గుంటూరు సిటీ, గ్రామీణ ప్రాంతంలో మరొకటి, పల్నాడులో ఒకటి, చీరాలలో ఒకటి వచ్చిందని తెలిపాడు. మరోవైపు ఈ ట్వీట్ కి నెటిజన్లు రిప్లైలు ఇస్తున్నారు.

# రైలు కిటికీ నుంచి జారిపడ్డ 8 ఏళ్ల చిన్నారి

## చిమ్మచీకట్లోనే 16 కిలోమీటర్లు గాలించిన పోలీసులు.. చెట్ల పొదల్లో స్పృహకోల్పోయిన స్థితిలో బాలిక గుర్తింపు

ముందడుగు ఉత్తరప్రదేశ్:

మధ్యప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మథుర వెళ్లేందుకు ఓ కుటుంబం తమ 8 ఏళ్ల చిన్నారితో కలిసి రైలెక్కింది. వీరు బోగీలోని ఎమర్జెన్సీ కిటికీ వద్ద ఉన్న సీట్లలో కూర్చుకున్నారు. వెంటిలేషన్ కోసం కొందరు ప్రయాణికులు ఈ విండోను తెరిచారు. మార్గమధ్యంలో ఆ బాలిక ఉన్నట్టుండి కిటికీ నుంచి జారి కిందపడిపోయింది. గమనించిన చిన్నారి తండ్రి వెంటనే లలిత్‌పుర్ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ పోలీసులను ఆశ్రయించారు. అప్రమత్తమైన ఝాన్సీ జీఆర్పీ పోలీసులు.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌తో కలిసి గాలింపు చేపట్టారు. నాలుగు బృందాలుగా విడిపోయి రాత్రివేళ చిమ్మచీకట్లోనే 16 కిలోమీటర్ల మేర కాలినడకన గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే పట్టాల పక్కన ఉన్న ఓ చెట్ల పొదల్లో గాయాలతో స్పృహకోల్పోయిన స్థితిలో బాలికను గుర్తించారు. ఆ ప్రాంతానికి రోడ్డు మార్గం లేకపోవడంతో అటుగా వెళ్తున్న గూడ్స్ రైలును ఆపి వెంటనే లలిత్‌పుర్‌కు తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. తన కుమార్తెను కాపాడిన రైల్వే పోలీసులకు ఆ పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను యూపీ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. టీమ్‌వర్క్‌తో చిన్నారి ప్రాణాలను కాపాడిన రైల్వే పోలీసులు, అధికారులను నెటిజన్లు కొ ని యా డు తు న్నా రు . రియల్ హీరోలంటూ అభినందిస్తున్నారు.



ముందడుగు
బుధవారం, 16-10-2024, హైదరాబాద్

## దీపావళి బాణసంచా ప్రమాదాల నుండి రక్షణ నుంచి ఫోన్‌పే ఇన్సూరెన్స్


**ముందడుగు హైదరాబాద్:**

రాబోయే దీపావళి పండగ సీజన్‌ను పురస్కరించుకుని, బాణసంచా సంబంధిత ప్రమాదాలనుండి సమగ్ర రక్షణ అందించి, సరసమైన ఇన్సూరెన్స్ కవరేజ్ అందించేలా కొత్త ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్నామని ఫోన్‌పే నేడు ప్రకటించింది. పండగ సీజన్ సందర్భంగా కేవలం ₹9 (GST సహా) కే అందుబాటులోకి వచ్చిన ఈ కవరేజ్ ప్లాన్ బాణసంచా సంబంధిత ప్రమాదాల నుండి రక్షణ కల్పించేలా ఫోన్‌పే యూజర్లకు 10 రోజుల చెల్లుబాటుతో ₹25,000 వరకు కాంప్రహెన్సివ్ కవరేజీని అందిస్తుంది. ఈ ఆవిష్కరణతో, దేశవ్యాప్తంగా యూజర్లు తమకు ఆస్పత్రి ఖర్చులు, ప్రమాద చికిత్స ఖర్చులకు తగిన రక్షణ ఉందనే ధీమాతో పండుగను భద్రతతో, మనశ్శాంతితో జరుపుకోవచ్చు.

ఈ సందర్భంగా ఫోన్‌పే ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ సంస్థ సిఈఓ విశాల్ గుప్తా మాట్లాడుతూ, "పండగ సీజన్ సందర్భంగా ఫోన్‌పే ఫైర్ క్రాకర్ (బాణసంచా) ఇన్సూరెన్స్‌ను ప్రవేశపెట్టడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ కవరేజ్ ఎలాంటి ప్రమాదాలు లేదా దాని వల్ల తలెత్తే ఆర్థిక భారం గురించి ఆందోళన చెందకుండా ప్రతికుటుంబం పండుగలను మనశ్శాంతితో జరుపుకోవడానికి వీలుగా వారికి అత్యావశ్యకమైన రక్షణ అందిస్తుంది.

## 'అక్కా' అని పిలుస్తూ అసభ్య ప్రవర్తన..
# యువకుడిపై కేసు నమోదు

మహిళ ఇంటికి వచ్చి కత్తితో బెదిరిస్తున్న యువకుడిపై జూబ్లీహిల్స్‌పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నవోదయ కాలనీలో నివాసం ఉంటున్న వివాహిత(36) తన ఇంటికి సమీపంలోని టైలర్ షాపులో చాలా ఏళ్లుగా బట్టలు కుట్టిస్తూ ఉండేది. కాగా, టైలర్ కొడుకు రిషి (21) గత కొంతకాలంగా షాపుకు వచ్చే వివాహితను అక్కా అని పిలుస్తూ అప్పుడప్పుడు మాట్లాడుతుండేవాడు. అయితే కొన్ని రోజులనుంచి రిషి ప్రవర్తనలో మార్పు రావడంతో పాటు అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టడం, రాత్రిపూట కాల్స్ చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నాడు. దీంతో సదరు మహిళ నాలుగురోజుల క్రితం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పెటీ కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. తమ కొడుకు మానసిక స్థితి సరిగాలేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని రిషి కుటుంబసభ్యులు సర్దిచెప్పారు. కాగా, మంగళవారం తెల్లవారుజామున వివాహిత ఇంటి వద్దకు కత్తితో వచ్చిన రిషి న్యూసెన్స్ చేయడంతో పాటు చంపేస్తానంటూ బెదిరింపులకు గురిచేశాడు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇవ్వగా అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.






## మెగ్నీషియం..
# మెగా ప్రయోజనం!

మారుతున్న జీవనశైలి.. మనిషిని మంచాన పడేస్తున్నది. అవసరమైన పోషకాలు లేక.. శరీరం రోగాల పుట్టగా మారుతున్నది. చీటికీమాటికీ ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నది. ముఖ్యంగా, 'మెగ్నీషియం' లోపంతో నవతరం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నది. రోజువారీ జీవితంలో కీలకపాత్ర పోషించే మెగ్నీషియం.. మనిషి శరీరంలో జరిగే సుమారు 300 రకాల రసాయనిక చర్యల్లో కీలకపాత్ర పోషిస్తుంది. అలాంటి మెగ్నీషియం లోపిస్తే.. తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ లెక్కల ప్రకారం.. ప్రతిరోజూ పురుషులకు 400 మి.గ్రా., మహిళలకు 300 మి.గ్రా. మెగ్నీషియం అవసరమవుతుంది. రోజువారీగా తీసుకునే ఆహారం ద్వారా ఇది శరీరానికి అందుతుంది. అయితే, శరీరానికి తగినంత మెగ్నీషియం అందకపోతే.. మనిషిలో అనేక లక్షణాలు కనిపిస్తాయి. వీటిని ముందుగానే గుర్తించి, వైద్యుణ్ని సంప్రదిస్తే మంచిది.

శరీరంలో మెగ్నీషియం తగినంత పరిమాణంలో ఉంటేనే.. హృదయ స్పందనలు సక్రమంగా సాగుతాయి. లేకుంటే.. హార్ట్‌రేట్ రూటు మారుతుంది. గుండె దడగా అనిపిస్తుంది. ఊపిరి పీల్చుకోవడంలోనూ ఇబ్బంది కలుగుతుంది.

వికారంగా అనిపించినా, ఆకలి లేకపోయినా.. మీ శరీరంలో మెగ్నీషియం లోపం ఉన్నట్టే! జీర్ణాశయం సజావుగా పనిచేయడంలోనూ మెగ్నీషియం పాత్ర ఉంటుంది. శరీరంలో మెగ్నీషియం తగ్గితే.. జీర్ణ సమస్యలకు దారితీస్తుంది.

శరీరంలో తగినంత మెగ్నీషియం లేకుంటే.. కంటి సమస్యలూ చుట్టుముడతాయి. కళ్ల మంట, కళ్ల నుంచి నీరుకారడం లాంటి సమస్యలు కనిపిస్తాయి.

కండరాల ఆరోగ్యం, పనితీరులో మెగ్నీషియం కీలకంగా వ్యవహరిస్తుంది. ఇది శరీరంలో తగినంతగా లేకపోతే తీవ్రమైన కండరాల నొప్పి, తిమ్మిరి వేధిస్తాయి.

మెగ్నీషియం లోపం.. మనిషికి నిద్రను దూరం చేస్తుంది. నిద్రలేమితోపాటు తలనొప్పి, చికాకు ఇబ్బంది పెడుతాయి. ఎముకలు, నరాలు ఆరోగ్యంగా ఉండాలన్నా, వాటి పనితీరు బాగుండాలన్నా.. కావాల్సినంత మెగ్నీషియం ఉండాల్సిందే! కాల్షియం కూడా చాలా అవసరం. ఈ ఖనిజాలలో అసమతుల్యత కండరాల తిమ్మిరి, కండరాల నొప్పికి కారణమవుతుంది. కాల్షియం, మెగ్నీషియం రెండిటినీ సమతుల్యంగా ఉంచుకోవడం చాలా అవసరం.


## ఆహారంతో అందిద్దాం..

మెగ్నీషియం లోపం ఉన్నవారు రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. గుమ్మడి గింజలు, పాలకూర, బచ్చలికూర, అరటిపండ్లు, నల్ల జీలకర్ర, పల్లీలు, బ్రౌన్ రైస్, సాల్మన్ చేపల్లో మెగ్నీషియం ఎక్కువగా దొరుకుతుంది. జీడిపప్పు, బాదంపప్పు, అవకాడో, నట్స్, బ్రౌన్ రైస్, తృణధాన్యాలు, బీన్స్, పప్పు దినుసులు, పచ్చి బఠానీలు, శనగలు, పాలు, పెరుగు, సోయా ఉత్పత్తుల్లోనూ మెగ్నీషియం లభ్యమవుతుంది. బెర్రీలు, అంజీర్, బ్రకోలీ, క్యాబేజీ, మొలకలలోనూ మెగ్నీషియం పుష్కలంగా లభిస్తుంది. ఇక శరీరంలో మెగ్నీషియం తక్షణమే ఉత్పత్తి కావాలంటే.. ఒక కప్పు కాఫీ తాగడమో.. ఒక డార్క్ చాక్లెట్ తినడమో చేయాలి.

ముందడుగు
బుధవారం, 16-10-2024, హైదరాబాద్

## అల్లు అర్జున్ టీం పుష్ప 2 ది రూల్ స్పెషల్

# ప్రీమియర్స్ ప్లాన్.. !



టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ (**Allu Arjun**) అభిమానులతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా పుష్ప 2 ది రూల్ (**Pushpa 2 The Rule**). సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న సీక్వెల్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా... మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు.

ఈ చిత్రాన్ని 2024 డిసెంబర్ 6న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. తాజాగా పుష్ప స్పెషల్ ప్రీమియర్స్‌కు సంబంధించిన వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఒక్క రోజు (డిసెంబర్ 5న) ముందే పుష్ప 2ను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాలని ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ప్రీమియర్స్ ఉండబోతున్నాయట. అంతేకాదు ముంబైలో తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ 4న రాత్రి 9:30 గంటలకు గ్రాండ్ షో వేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్.

ఇక విడుదల రోజు వేకువ జామునే 1 గంటలకు పెయిడ్ ప్రీమియర్స్ వేయబోతున్నారట. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావడమే తరువాయి అని తెలుస్తోంది. ఇక ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుర౦డటంతో క్యూరియాసిటీ అమాంతం పెరిగిపోతుంది.
సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# ఆర్జీవీ డెన్‌లో ఓ యానిమల్‌తో మరో యానిమల్..

సోషల్ మీడియాలో ఎప్పుడూ ఏదో ఒక ట్వీట్‌తో వార్తల్లో నిలిచే డైరెక్టర్ల జాబితాలో రాంగోపాల్ వర్మ (Ram Gopal Varma) మొదటి స్థానంలో ఉంటాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఆర్జీవీ ఏ కామెంట్ పెట్టినా.. ఫొటో పెట్టినా నెట్టింట తెగ చర్చ జరగడమే కాదు.. అది టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా కూడా నిలుస్తుంటుంది. తాజాగా యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా (Sandeep Reddy Vanga)తో ఉన్న ఫొటోను ఎక్స్‌లో షేర్ చేశాడు వర్మ.
ఆర్జీవీ డెన్ (RGV DEN) యానిమల్ పార్క్‌లో ఓ యానిమల్ మరో యానిమల్‌ను ఇంకొక యానిమల్‌కు చూపిస్తుందంటూ తనదైన శైలిలో ట్వీట్ చేశాడు వర్మ. స్క్రీన్‌పై వర్మ చూపిస్తున్న విజువల్‌ను ఆసక్తిగా చూస్తున్నాడు సందీప్ రెడ్డి వంగా. ఇంతకీ వర్మ యానిమల్ డైరెక్టర్‌కు ఏం చూపిస్తున్నాడన్నది మాత్రం మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. మరి దీనిపై ఈ ఇద్దరు క్రేజీ దర్శకులు ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలంటున్నారు సినీ జనాలు.
హైదరాబాద్‌లో వర్మ ప్రత్యేకంగా నిర్మించుకున్న ఆర్జీవీ డెన్ ఎంత పాపులర్ అయ్యిందో తెలిసిందే. ఆర్జీవీ డెన్‌కు ఆసక్తిగల దర్శకులు, రైటర్స్, మ్యూజిక్ కంపోజర్స్ కావాలంటూ ఓ ప్రకటన కూడా చేశాడు వర్మ. ఈ ఏడాది వర్మ ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీలో కామియో రోల్‌లో మెరిసి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చాడని తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా ఖాతాలో యానిమల్ పార్క్, స్పిరిట్ సినిమాలున్నాయి.